సాక్షి
నిజామాబాద్
సోమవారం । 31 । మార్చి । 2025





**శంకుస్థాపనకే పరిమితమా?**
వేల్పూర్ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు.
- 8లో ▸



**ప్రారంభించారు..**
వర్ని ప్రాంతంలో ముందుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.0 /21.7

**వాతావరణం**
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అమ్మవారికి వెండి వీణ బహూకరణ



బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి దాతలు ఆదివారం వెండివీణ బహూకరించారు. జిల్లాకు చెందిన నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్ సంస్థ చైర్మన్ క్యాతం శ్రీదేవి-సంతోష్ దంపతులు రూ.5లక్షలు వెచ్చించి 4 కేజీల వెండితో తయారు చేయించిన వీణను బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు తీర్థప్రసాదం అందజేసి శాలువాతో సత్కరించారు.

### కొత్త మండలాలకు పోస్టులు మంజూరు

నిజామాబాద్ అర్బన్: నూతనంగా ఏర్పడిన మండలాలకు రెవెన్యూ శాఖలో పోస్టులు మంజూరయ్యాయి. జిల్లాలో ఆలూరు, డొంకేశ్వర్, సాలూర, పోతంగల్ మండలాలకు పోస్టులు కేటాయించారు. ఒక్కో మండలానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఎంఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, మండల సర్వేయర్, ఏఎస్‌వో పోస్టులు మంజూరయ్యాయి. మండలానికి తొమ్మిది పోస్టుల చొప్పున త్వరలోనే భర్తీ చేయనున్నారు.

### నేడు ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: రంజాన్ సందర్భంగా నిజామాబాద్ నగరంలో సోమవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు బస్టాండ్ నుంచి బయల్దేరి జెడ్పీ మీదుగా బైపాస్‌రోడ్డు, అర్సపల్లి రైల్వేగేటు మీదుగా బోధన్ వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బోధన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా న్యూ కలెక్టరేట్, బైపాస్ మీదుగా నగరానికి చేరుకోవాలని, బోధన్ వైపు వెళ్లే ఇతర వాహనాలు మాధవనగర్, కంఠేశ్వర్ బైపాస్ అర్సపల్లి రైల్వేగేటు మీదుగా వెళ్లాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ డైవర్షన్‌ను దృష్టిలో ఉంచుకుని రాకపోకలు సాగించాలని ఏసీపీ కోరారు.

### 'మన్ కీ బాత్' వీక్షణ



సుభాష్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నగరంలోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం వీక్షించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అక్కాచెల్లెళ్ల అద్భుత ప్రయత్నాన్ని మోదీ ప్రస్తావించారు. వారు మహువ (ఇప్ప) పూవును ఉపయోగించిరు చికరమైన ఆహార పదార్థాలు, స్వీట్లు తయారు చేస్తున్నారని, ఆదివాసీ సాంప్ర దాయానికి ఆధునికతను మేళవించారని కొ నియాడారు. సాంప్రదాయ పుష్పానికి కొత్త ఉపయోగాలు కనుగొంటున్నారని, తద్వారా ఇప్ప పూవుకు మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతున్నాయని, ఆదివాసీ సముదాయాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా గొప్ప మార్గాన్ని సూచిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాత కలెక్టరేట్‌లోని అమ్మవారి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు, పాల్గొన్న ఉద్యోగ జేఏసీ నాయకులు

# ఉగాది సంబురం



హిందూ సంఘాల ఆధ్వర్యంలో రుద్రూర్ మండలం అంబం(ఆర్)లో ధర్మధ్వజం ఆవిష్కరణ

## విశ్వావసుకు విశ్వాసంతో ఆహ్వానం

- ఇంటింటా ఘనంగా తెలుగు సంవత్సరాది
- ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రవణాలు



రెంజల్ మండలం కళ్యాపూర్‌లో కుస్తీపోటీలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: విశ్వావసు నామ తెలుగు సంవత్సరాదికి ఇంటింటా ఘనంగా ఆహ్వానం పలికారు. ఉగాది పర్వదినాన్ని ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనంతో చేసుకునే పండుగ.. ప్రతి ఇంటిలో ఉత్సాహాన్ని నింపింది. జిల్లావ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు ఏర్పాటు చేయగా, పండితులు పంచాంగాన్ని వినిపించారు. సనాతన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుని భావి తరాలకు అందించాలని పండితులు సూచించారు. ఆయా చోట్ల కవి సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. భారతదేశాన్ని సమున్నత స్థాయిలో ఉంచేందుకు ప్రతి భారతీయుడు పాటుపడాలని సూచించారు. ఆలయాల్లో ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఇందూరు నగరంలోని బస్వాగార్డెన్స్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని వందలాది మంది తమ కుటుంబసభ్యులతో కలిసి ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్నారు. పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన కందకుర్తి మూ లాలున్న కేశవ బలిరాంపంత్ హెడ్గేవార్ పుట్టినరో జు కూడా ఉగాది రోజే కావడంతో ఆయనను స్మరించుకున్నారు.



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపు



ఎడపల్లి మండలం రాణాకలాన్‌లో జడకొప్పు..

# నేడు ఈద్- ఉల్- ఫితర్

- సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ రూరల్: కఠిన నియమాలతో నెల రోజులపాటు ఉపవాస దీక్ష పాటించిన ముస్లిములు సోమవారం ఈద్-ఉల్-ఫితర్ నిర్వహించుకోనున్నారు. ఆదివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగకు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్, పాత బస్టాండ్, గాంధీచౌక్, అహ్మదీబజార్ తదితర ప్రాంతాల్లో కొనుగోళ్ల సందడి నెలకొంది. రంజాన్ సామూహిక ప్రార్థనల కోసం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్న కచియా మసీద్, ఖిల్లా ప్రాంగణంలోని జామా మసీదు, ఇతర ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి.

**ఈద్గాలను పరిశీలించిన సీపీ**

ఖలీల్‌వాడి: రంజాన్ సందర్భంగా నిజామాబాద్ డివిజన్ పరిధిలోని ఈద్గాలు, మసీద్‌లను సీపీ పోతరాజు సాయి చైతన్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మత పెద్దలతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో దాదాపు 450 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సీపీ వెంట నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎస్సైలు, ఈద్గా పెద్దలు ఉన్నారు.



ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఖిల్లా ఈద్గా



ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

**శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

నిజామాబాద్ అర్బన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిములు అదే స్ఫూర్తితో సోమవారం ఈద్-ఉల్-ఫితర్‌ను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

# స్వల్పంగా పెరిగిన ఉపాధి కూలి ధర

- రూ.300 నుంచి రూ.307కు పెంపు
- రేపటి నుంచి అమలులోకి..

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధిహామీ పథకంలో చెల్లించే కూలి స్వల్పంగా పెరిగింది. రూ.300 నుంచి రూ.307కు కూలిని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూలిని ఏకంగా రూ.28కి పెంచారు. అంతకు ముందు రూ.15 పెంచారు. కూలి ధర పెరగడంతో జిల్లాలోని 5.55లక్షల మంది ఉపాధి కూలీలకు ప్రయోజనం చేకూరనుంది. అయితే కూలి మరింత పెంచితే బాగుండేదని కూలీలు అభిప్రాయపడుతున్నారు. పెరిగిన కూలి ధరలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయని కమ్మర్‌పల్లి ఏపీవో విద్యానంద్ 'సాక్షి'తో చెప్పారు.



# గ్రూప్-1లో జిల్లావాసుల సత్తా

- మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ రోజాబాయికి 206వ ర్యాంక్
- వాణిజ్య పన్నుల శాఖ జూనియర్ అసిస్టెంట్‌కు 658..



రోజాబాయి

నిజామాబాద్ సిటీ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 జనరల్ ర్యాంకులను విడుదల చేయగా జిల్లావాసులిద్దరు సత్తాచాటారు. నిజామాబాద్ నగరానికి చెందిన కడావత్ రోజాబాయికి 206వ ర్యాంకు దక్కింది. 472 మార్కులు సాధించిన ఆమె.. జనరల్ కోటాలో 206వ ర్యాంకు, మల్టీ జోన్-1 ఎస్టీ (జనరల్) కోటాలో 6వ, ఎస్టీ మహిళల విభాగంలో 2వ ర్యాంకు సాధించారు. రోజాబాయి వ్యవసాయం మీద అభిమానంతో రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యా లయంలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేశారు. ఇప్పటికీ నాలుగుసార్లు గ్రూప్స్ రాసిన రోజాబాయి గ్రూప్-2లో 323 మార్కులు, గ్రూప్-3లో 258, గ్రూప్-4లో 151 మార్కులు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన వార్డు ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన రోజాబాయి ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్నారు.

**ఆనంద్‌కు మరో ర్యాంక్..**



మాదరి ఆనంద్

నిజామాబాద్‌నాగారం: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన మాదరి ఆనంద్ గ్రూప్ -1 జనరల్ ర్యాంకింగ్‌లో 658వ ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్.. గతంలో విడుదలైన గ్రూప్-2లో బీసీ-సీ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్, గ్రూప్-3లో బీసీ-సీ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.

# మిగిలింది 61 రోజులే

- నత్తనడకన సాగుతున్న పనులు
- గడువులోగా మాధవనగర్ ఆర్వోబీ పనులు పూర్తయ్యేనా?

మరో 61 రోజులే గడువు మిగిలింది. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. పనులు నత్తనడకన సాగుతుండడంతో రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు.

నిజామాబాద్ రూరల్ : నిజామాబాద్ శివారులోని మాధవనగర్ వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. వచ్చే మే 31లోగా కాంట్రాక్టర్ పనులు మొత్తం పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో ఇంకా పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 60 శాతం పనులు పూర్తికాగా, మిగతా 40 శాతం పనుల పూర్తికి మరో సంవత్సర కాలం పట్టేలా కనిపిస్తోంది.

**సమష్టి నిధులతో నిర్మాణం..**

మాధవనగర్ ఆర్వోబీ పనులు 2022 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.30.05 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.63.07 కోట్లు, మొత్తం రూ. 93.12 కోట్లు కేటాయించారు. దాదాపు మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న పనులు, మధ్యలో నిధుల మంజూరులో జాప్యం ఏర్పడడంతో ఆరు నెలలపాటు నిలిచిపోయాయి.

అదే సమయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆర్వోబీ పనులను వేర్వేరుగా సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ వాటాకు సంబంధించిన నిధులు ఎప్పుడో మంజూరయ్యాయని ఎంపీ తెలుపగా, నిర్ణీత సమయంలోగా పూర్తిచేస్తామని, పనులకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కానీ, మరో రెండు నెలల్లో పూర్తి కావాల్సిన ఆర్వోబీ పనులకు అటు నిధుల లేమితోపాటు రైల్వే సంబంధిత పనులతోనే ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.



మాధవనగర్ వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ పనులు

**వానకాలంలోపు పూర్తయ్యేనా?**

ప్రస్తుత వేసవికాలంలోనే ఆర్వోబీ పనులు పూర్తయితే ఎలాంటి ఇబ్బంది ఏర్పడదు. పనులు నెమ్మదిగా సాగితే మాత్రం వానకాలంలో ఆటంకం ఏర్పడే చాన్స్ ఉంది. దీంతో మిగతా పనులు పూర్తయ్యేందుకు మరో ఏడాది సమయం పడుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరం పాటు రాకపోకలకు అవస్థలు తప్పేలా లేవని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**నిధుల మంజూరులో జాప్యం**

నిధుల మంజూరులో ఆలస్యం, రైల్వే పనులతోనే ఆర్వోబీ పనులు ఆలస్యమవుతున్నాయి. ట్రాక్ వద్ద మా పనులు ముగిశాయి. రైల్వే శాఖ అధికారులు పనులు పూర్తిచేస్తే పైనుంచి బ్రిడ్జికి సంబంధించిన పనులను ప్రారంభిస్తాం. ఈ సంవత్సరం చివరి నాటికి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తాం.

– సాయికుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ

**త్వరితగతిన పూర్తిచేయాలి**

మూడు సంవత్సరాలుగా ఆర్వోబీ పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికులతోపాటు సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే పెండింగ్ పనులను పూర్తిచేసి ఆర్వోబీని సకాలంలో పూర్తి చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, నగరవాసి

# ప్రకృతి ప్రసాదం తునికి పండు

- అడవిలో మాత్రమే లభించే పోషకాల గని
- ప్రయాసతో సేకరిస్తున్న గిరిజనులు
- ఏడాదిలో నెలరోజులు మాత్రమే లభ్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తునికి పండు.. దీని విలువ తెలిసినవారు, దీన్ని రుచి చూసినవారు మళ్లీ మళ్లీ కోరుకుంటారు. చెప్పుకుంటూ పోతే ఈ పండు ప్రత్యేకతే వేరు. కేవలం నెలరోజులు (మార్చి మూడోవారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు) మాత్రమే లభించే ఈ పండ్ల చెట్లను ఎవరూ పెంచరు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమూ ఉండదు. అడవిలో మాత్రమే లభించే తునికిపండ్లను గిరిజనులు మాత్రమే సేకరిస్తారు. అత్యధిక పోషక విలువలు, ఫైబర్ కలిగి ఉన్న తునికి పండ్లు పూర్తి ప్రకృతి ప్రసాదించిన వరమని, ఈ పండ్లు అమూల్యమైనవని వైద్యులు సైతం చెబుతుంటారు. అడవిలో మాత్రమే ఉండే తునికి చెట్లకు ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడమనేదే ఉండదు. దీంతో ఇవి పూర్తి సహజసిద్ధమైనవి. పండు పైభాగంలో గట్టిగా ఉంటుంది. పండిన తరువాత ఈ పైభాగాన్ని తేలికగా తీసేయవచ్చు. లోపల గుజ్జు, గింజలు ఉంటాయి. ఈ గుజ్జు రుచి అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం తునికి పండ్లు నిజామాబాద్ నగరంలో లభ్యమవుతున్నాయి. ఇందల్వాయి మండలంలోని పాటి తండాకు చెందిన కొందరు గిరిజనులు వీటిని అడవిలో సేకరించి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఎక్కువగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాలతోపాటు నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి, సిరికొండ, గాంధారి మండలాల్లోని అటవీప్రాంతాల్లో తునికి పండ్లు లభిస్తాయి. అద్భుతమైన సహజసిద్ధ పోషక విలువ తెలిస్తే ఈ పండ్లను కొని తినడం మానరు.



నగరంలో తునికి పండ్లు విక్రయిస్తున్న వాలియా

**నెలరోజులు మాత్రమే..**

తునికిపండ్లు ఏడాదిలో నెల రోజులు మాత్రమే ఇందల్వాయి, సిరికొండ, గాంధారి మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో లభిస్తాయి. వీటిని సేకరించేందుకు అనేక ఇబ్బందులు పడతాం. తీసుకొచ్చిన తర్వాత మాగబెట్టేందుకు రెండు రోజులు పడుతుంది. ఆ తర్వాత నిజామాబాద్ వరకు బస్సులో పండ్లను తీసుకొచ్చి అమ్ముకుంటాం. ఎండలో కూర్చుని రోజంతా అమ్మితే రూ.400 వరకు వస్తాయి.

– వాలియా, పాటితండా, ఇందల్వాయి మండలం

# ప్రతి ఒక్కరూ లోకహితం కోసం పనిచేయాలి

నిజామాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ లోకహితం కోసమే పనిచేయాలని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రత్యేక ఆమంత్రిత సభ్యులు రాంపల్లి మల్లికార్జున్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్‌లోని బస్వా గార్డెన్‌లో ఉగాది మహోత్సవంనిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో నివసించే వారంతా హిందువులేనని, ఈ విషయాన్ని వందేళ్ల క్రితమే ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ స్పష్టంగా తెలియజేశారన్నారు. ఆ ఒక్క మాట ఆధారంగానే వందేళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ దేశ సమగ్రత కోసం పనిచేస్తోందన్నారు. హిందూ సమాజాన్ని కలిపి ఉంచేందుకు సంఘటన మంత్రాన్ని పఠించారన్నారు. ప్రతి హిందువు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి లోకహితం కోసం పనిచేయాలన్నారు. ముఖ్య అతిథి, వైద్యుడు అంకం గణేశ్ మాట్లాడుతూ.. హిందూ సమాజం కలిసి ఉండడం ఒక్కటే అన్ని సమస్యలకు సమాధానమని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం, నగర కార్యవాహ అర్గుల సత్యం, సహకార్యవాహలు సుమిత్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంపల్లి మల్లికార్జున్

## క్లుప్తంగా

### పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



బాన్సువాడ రూరల్: పండుగలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ అశోక్ కోరారు. ఆదివారం ఆయన బోర్లం గ్రామంలో ఉన్న మసీదులో ముస్లిములకు రంజాన్ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అయ్యూబ్, శంశీర్‌ఖాన్, సయ్యద్ జలీల్, సలీం, మహిబూబ్, అర్షద్‌ఖాన్, అమీన్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు సౌకర్యం కల్పించాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ జీపీ పరిధిలోని ఛత్రునాయక్ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తండా వాసులు కోరుతున్నారు. తండాలో 20 కుటుంబాలు నివాసం ఉంటున్నా, నేటికి రోడ్డు సౌకర్యం లేదు. దీంతో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

### ఆలయ భూముల కౌలు వేలం



మద్నూర్: మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆలయానికి చెందిన ఏడు ఎకరాల 26 గుంటల భూమి మద్నూర్ శివారులో మూడు చోట్ల ఉందన్నారు. ఆలయ భూములను నాగంవార్ వెంకన్న, వట్నాల్‌వార్ సాయన్న, వంకాయల్‌వార్ నాగన్న ముగ్గురు వేలంలో పాల్గొని ఆలయ భూములను కౌలు చేయడానికి ముందుకు వచ్చినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనకే పరిమితమా?

- ఒక్క అడుగు ముందుకు పడని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పనులు
- వేల్పూర్ శివారులో ఏర్పాటుకు గత ప్రభుత్వం నిర్ణయం
- 2023లో శంకుస్థాపన చేసినా ఇప్పటికీ ప్రారంభం కాని పనులు

మోర్తాడ్: మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన సరుకులను అందించడానికి నిర్దేశించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సెప్టెంబర్ 2023లో రూ.39.37లక్షల అంచనా వ్యయంతో అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్ శివారులోని స్పైస్‌పార్క్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం శంకుస్థాపన నిర్వహించారు. కానీ ఏడాదిన్నర కాలం గడచినా కనీసం పునాది రాళ్ల దశను చేరుకోలేకపోయింది.

**మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత కోసం..**

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరిస్తామని గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేకమార్లు హామీ ఇచ్చింది. ప్రజలకు నాణ్యమైన పసుపు పొడి, కారంపొడి అందించి మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతను అందించడానికి ఈ ప్రాజెక్టును నిర్దేశించారు. పసుపు, కారం పొడిల ఉత్పత్తి, మసాలల తయారీతో



వేల్పూర్ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం వేసిన శిలాఫలకం (ఫైల్)

మహిళా సంఘాల సభ్యులకు చేతినిండా పని కల్పించవచ్చని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించారు.

జిల్లాలో పసుపు పంట సాగు చేస్తుండటంతో పసుపు ఉత్పత్తులకు శ్రీకారం చుడితే రైతులకు మంచి ధర లభిస్తుంది. పసుపు ఉత్పత్తుల ఎగుమతులతో అనేక మందికి నాణ్యమైన పొడి లభించడానికి అవకాశం ఉంది. కారం, మసాలాలను కూడా స్థానికంగానే తయారు చేస్తే మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమైతారని అందరూ ఆశించారు.

బీడీ పరిశ్రమ అంతంత మాత్రంగానే ఉండటంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కొంతమందికైనా ప్రత్యామ్నయ ఉపాధి లభిస్తుందనే నమ్మకం కలిగింది. అప్పటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో శిలాఫలకంతోనే సరిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారిస్తే వేల్పూర్‌లోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ జీవం పోసుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**కలెక్టర్‌కు నివేదించాం...**

వేల్పూర్‌లో శంకుస్థాపన చేయగా పెండింగ్‌లో ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అంశంపై ఫైల్‌ను కలెక్టర్ కార్యాలయానికి పంపించాం. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన నిర్వహించగా ఎన్నికల కారణంగా అప్పట్లో ఆగిపోయింది. ఈ ప్రభుత్వం కూడా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల విషయంలో ఆసక్తి చూపుతుంది. ముందుముందు అనుమతి వస్తే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

– మారుతి, డీపీఎం, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ

# ప్రారంభించారు.. కొనుగోళ్లు మరిచారు..



వర్నిలో ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం

- వర్నిలో ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ఇప్పటికీ వరి పంటను కొనుగోలు చేయని వైనం
- ఆందోళనలో అన్నదాతలు

వర్ని: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతోపాటు బోనస్‌ను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వర్ని ప్రాంతంలో వరి కోతలు ముందుగా ప్రారంభం కావడంతో వారం క్రితం రాష్ట్రంలోనే మొదటిసారిగా వర్ని ప్రాంతంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఒప్పించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కానీ ఇప్పటివరకు ధాన్యంను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేయకపోవడంతో..**

అన్నదాతలు వారం నుంచి కోత కోసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలు ఎక్కడ పడతాయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యం రకానికి రూ. 2320, బీ గ్రేడ్ రకానికి రూ.2300 ప్రకటించింది. కానీ కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో దళారులు ధాన్యాన్ని రూ.1700లకే రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. అన్నదాతలు అకాల వర్షాలకు భయపడి ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రైస్‌మిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో నేటి వరకు తూకాలు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి..**

దళారులు గిట్టుబాటు ధర చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లను తరలించాలని నిర్ణయించుకున్నాం. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించకపోవడంతో వారం నుంచి ధాన్యాన్ని ఎండబెడుతూనే ఉన్నాం. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. వెంటనే అధికారులు స్పందించి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించాలి.

– లచ్చయ్య, రైతు, బొప్పాపూర్

**ఉన్నతాధికారులకు విన్నవించాం..**

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా నేటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వాస్తవమే. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏ రైస్‌మిల్‌కు పంపాలో అధికారులు అలాట్‌మెంట్ చేయకపోవడంతో కొనుగోలు చేయలేకపోతున్నాం. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాం. అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే కొనుగోళ్ల ప్రారంభిస్తాం.

– గంగాధర్, సీఈవో, వర్ని సహకార సంఘం

# బస్టాండ్ ఉన్నా.. ఎండలోనే పడిగాపులు..!



బాల్కొండలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్



ఎండలో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

- నిరుపయోగంగా బాల్కొండ బస్టాండ్
- ప్రయాణ ప్రాంగణంలోకి రాని బస్సులు
- రోడ్డుపై ప్రయాణికుల ఇబ్బందులు

బాల్కొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు రోడ్డుపై ఎండలో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. బస్టాండ్‌లోకి 2007 వరకు బస్సులు వెళ్లేవి. కానీ జాతీయ రహదారి 44కి బైపాస్ రోడ్డు నిర్మించడంతో అప్పటి నుంచి బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు పాత జాతీయ రహదారి 44పై, వన్నెల్(బి) చౌరస్తా వద్ద ఎండలో బస్సుల కోసం, ఆటోల కోసం ఎదురు చూస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ఏళ్ల తరబడి పాలకుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..**

జాతీయ రహదారి పక్కన బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. బస్టాండ్ భవనంలో మేకలను, పశువులను ఉంచుతున్నారు. అంతేకాకుండ మందుబాబులు తాగి చిందులు వేస్తున్నారు. కొండ ప్రాంతం పక్కన ఉండటంతో పలువురు అసాంఘిక కార్యక్రమాలతో రెచ్చిపోతున్నారు. అయినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి..**



బాల్కొండ మండల కేంద్రంలో నిరూపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలి. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై ఎండలో నిలబడుతున్నారు. కనీసం రోడ్డు పక్కన షెల్టర్ కూడ ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి.

– నర్సింగ్‌రావు, గ్రామస్తుడు

# కాడెద్దులు @రూ.3వేలు

- ఉగాది ఎడ్లబండ్ల ప్రదర్శన కోసం అద్దెకు తీసుకుంటున్న భక్తులు



నారాయణ్‌ఖేడ్ నుంచి అద్దెకు తెచ్చిన ఎద్దులు

నాగిరెడ్డిపేట: అన్నదాతకు తోడుగా ఉండే కాడెద్దులు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. యాంత్రీకరణ అందుబాటులోకి రావడంతో రైతులు సైతం కాడెద్దులను వీడి ట్రాక్టర్ల బాటపట్టారు. ఫలితంగా కాడెద్దుల బండ్లు కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఒకరిద్దరి వద్ద మాత్రమే ఎడ్లు, బండ్లు ఉంటున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో జరిగే జాతరల్లో ఎడ్లబండ్ల ప్రదర్శనే ప్రధానం. ప్రస్తుతం ఎడ్లబండ్ల ఉనికి లేకపోవడంతో ఉత్సవాల కోసం వేల రూపాయలు వెచ్చించి ఇతర గ్రామాల నుంచి ఎడ్లబండ్లను అద్దెకు తీసుకొస్తున్నారు. మరికొందరు లక్షలు పెట్టి కొనుగోలు చేసి ఎడ్లబండ్ల ప్రదర్శన ముగిసిన తర్వాత వాటిని అమ్మేస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట్‌లో ఉగాది ఉత్సవాల సందర్భంగా నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ వేడుకలకు ఒక్కో జత ఎడ్లకు రూ.3వేలు నుంచి రూ.5వేలు చెల్లించి, ఒక్కో బండికి నాలుగైదు జతల ఎడ్లను కట్టి ప్రదర్శనలో తిప్పుతారు. ఇలా ఎడ్లబండిని తిప్పడానికి సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేస్తుండడం విశేషం.

# రసవత్తరంగా కుస్తీపోటీలు



బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లిలో కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

రెంజల్(బోధన్)/బోధన్‌రూరల్: ఉగాది పర్వదినం సందర్భంగా రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా జరిగాయి. కుస్తీపోటీలకు స్థానికులతోపాటు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చారు. డప్పు చప్పుళ్ల, యువకుల కేరింతల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. రూ. 50తో ప్రారంభించి చివరి కుస్తీని రూ. 2000గా విజేతలకు అందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి కుస్తీని ధర్మాబాద్ తాలూకా బెల్లూర్‌కు చెందిన విలాస్ అనే యువకుడు దక్కించుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాండ్ల నాగరాజు, కోశాధికారి బాలయ్య, ప్రతినిధులు మోహన్, శంకర్‌లతో పాటు మాజీ సర్పంచ్ మైని మోహన్, కాంగ్రెస్ నాయకుడు ఒడ్డెక్క మోహన్‌లు పర్యవేక్షించారు. అలాగే బోధన్ మండలం ఏరాజ్‌పల్లిలోనూ కుస్తీపోటీలు కొనసాగాయి.



గాంధారి మండలం నేరల్‌లో..

బాన్సువాడ/ గాంధారి: ఉగాది పండగను పురస్కరించుకుని పలు గ్రామాల్లో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా మారాయి. బాన్సువాడ మండలంలోని పోలీస్టేషన్ సమీపంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యామ రాములు, అవారి గంగారాం, యాట వీరేశం, పోగు నారాయణ, శశికాంత్, పర్తు నారాయణ తదితరులు ఉన్నారు. గాంధారి మండలం నేరల్ గ్రామంలో ఉగాది సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ కమిటీ, గ్రామస్తులు నగదు బహుమతులు అందజేశారు.

## క్రైం కార్నర్

### కారు బోల్తా పడి నలుగురికి గాయాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామ శివారులో గల 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన రాజశేఖర్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తుండగా ప్రమాదవశాత్తు కారు రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఘటనపై సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎడపల్లి(బోధన్): ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జంలం గ్రామానికి చెందిన లావణ్య (45) ఆర్థిక పరిస్థితి బాగాలేక ఈనెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే స్థానికులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. లావణ్య భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలి అత్తమ్మ సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీ చౌక్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఘటన స్థలంలో మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతుడు భిక్షాటన చేసేవాడై ఉంటాడని, వడదెబ్బ కారణంగా మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఒంటిపైన తెలుపు రంగు షర్టు, నలుపు రంగు పాయింట్ ధరించినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే ఫోన్ నెంబర్ 8712659839, 8712659717ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

### పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి, నలుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.44,720 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నగరంలోని సాయి నగర్, గాయత్రినగర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 3,710 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# సెలవులే.. మృత్యు శరములై..

- వరుస సెలవుల నేపథ్యంతో ఇంటికి వచ్చిన పిల్లలు
- చెరువు వద్ద ఆడుకుంటుండగా ప్రమాదం
- నీటమునిగి మృత్యువాత
- ఒకే కుటుంబంలోని నలుగురి మృతితో తీవ్ర విషాదం

వరుస సెలవులు ఆ పిల్లల పాలిట మృత్యుశరాలయ్యాయి. సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ముగ్గురు పిల్లలు చెరువు వద్దకు వెళ్లి ఆడుకుంటూ నీట మునిగారు. వారిని కాపాడే క్రమంలో పినతల్లి సైతం మృత్యువాతపడింది. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఎల్లారెడ్డిరూరల్ : వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మర్తి లింగయ్య అలియాస్ ఏసుకు గతంలో ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి గ్రామానికి చెందిన శ్యామలతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు మైథిలి, అక్షర, కుమారుడు వినయ్ ఉన్నారు. శ్యామల అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో మెదక్ జిల్లాకు చెందిన మరొకరిని వివాహం చేసుకున్నాడు. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో నెలరోజులకే విడిపోయారు. అనంతరం లింగయ్య లింగంపేట మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన మౌనికను పెళ్లి చేసుకున్నాడు. వీరిద్దరికి ఒక కూతురు జన్మించింది.



విలపిస్తున్న మృతుల బంధువులు

ఆమె ఆరునెలల వయసులో అనారోగ్యానికి గురై మృతిచెందింది. సవతి పిల్లలైన మైథిలి, అక్షర, వినయ్‌లను సొంత పిల్లలుగా చూసుకుంటూ కాలం గడుపుతోంది.



మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

**బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని పేర్కొన్నారు.

**సెలవులకు ఇంటికి రావడంతో..**

మెదక్‌లోని వెస్లీ పాఠశాలలో మైథిలి ఆరో తరగతి, అక్షర ఐదో తరగతి చదువుతున్నారు. వీరు అక్కడే హాస్టల్‌లో ఉండేవారు. కుమారుడు వినయ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులు సెలవులు రావడంతో ఈనెల 26న లింగయ్య ఇద్దరు కూతుళ్లను ఇంటికి తీసుకునివచ్చాడు. శనివారం మౌనిక బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్తూ పిల్లలను వెంట తీసుకువెళ్లింది. మౌనిక బట్టలు ఉతుకుతుండగా ముగ్గురు పిల్లలు చెరువులో దిగి స్నానాలు చేశారు. ఈ క్రమంలో విషాదం చోటు చేసుకుంది. పిల్లలు గుంతలో మునిగిపోతుండడాన్ని గమనించిన మౌనిక వారిని కాపాడేందుకు చెరువులో దిగి ఆమె సైతం నీటమునిగి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు కూతుళ్లను సెలవులలో ఇంటికి తీసుకుని రాకపోయి ఉంటే వారు బతికే వారేమోనని గ్రామస్తులు, బంధువులు చర్చించుకున్నారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

బాన్సువాడ: మండలంలోని కొల్లూర్ సమీపంలో ఇటీవల జరిగిన అమృతం విఠల్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈమేరకు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్(34) అనే వ్యక్తిని ఈ నెల 29న కొల్లూర్ సబ్ స్టేషన్ సమీపంలో దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని రోడ్డుపై పడేసి వెళ్లారు. పోలీసులు గ్రామంలో విచారించగా మృతుడి భార్య కాశవ్వ గ్రామానికి చెందిన అమృతం విఠల్ అనే వ్యక్తితో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. దీంతో భర్తకు దీర్ఘకాలిక వ్యాధి ఉండటంతో అతడి అడ్డు తొలగించుకోవాలని కాశవ్వ నిర్ణయించుకుంది. తన భర్తను చంపితే డబ్బులు ఇస్తానని చెప్పి కాశవ్వ తన బంగారాన్ని తనఖా పెట్టి ఈ నెల 28న రూ.18 వేలు తెచ్చి నిందితుడు విఠల్‌కు ఇచ్చింది. అదేరోజు నిందితుడు విఠల్‌ను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని దుర్కికి తీసుకెళ్లాడు. అక్కడ అతడికి కల్లు తాగించి, అనంతరం పుల్కంటి విఠల్, అమృతం విఠల్ కలిసి గొంతుకు టవల్ బిగించి పైపులతో కొట్టి చంపారు. మృతి దేహాన్ని కొల్లూర్ సబ్ స్టేషన్ సమీపంలోని బాన్సువాడ–బీర్కూర్ ప్రధాన రహదారిపై పడేసి వెళ్లారు. విచారణ అనంతరం కాశవ్వ, అమృతం విఠల్, పుల్కంటి విఠల్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ అశోక్

### ఎడ్లబండ్ల ప్రదర్శనలో అపశృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేటలో ఆదివారం జరిగిన ఉగాది ఉత్సవాలలో అపశృతి చోటుచేసుకుంది. ఎడ్లబండ్ల ప్రదర్శన కొనసాగుతుండగా బండి నుంచి తాడును తెంపుకున్న ఎద్దు బెదిరిపోయి జనాలపైకి దూసుకెళ్లింది. కాగా ఉత్సవాలను తిలకించేందుకు మెదక్ జిల్లా తిమ్మాయిపల్లి నుంచి వచ్చిన కర్రోల నాగమణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే గోపాల్‌పేటకు చెందిన రాజ్‌పేట మాధవి అనే మహిళ తలకు తీవ్రగాయమైంది. వీరితోపాటు మరికొంతమంది గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

### మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఎల్లారెడ్డిరూరల్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉస్మానియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ విందులో ముస్లిములకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పండ్లు తినిపించారు. గఫార్, ఆరీఫ్, గయా జుద్దీన్, పద్మశ్రీకాంత్, కుడుముల సత్యనారాయణ, ప్రశాంత్‌గౌడ్, సాయిబాబా, వినోద్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ప్రాజోలం సరఫరా ముఠా అరెస్ట్

- ముగ్గురు నిందితుల రిమాండ్.. పరారీలో మరొకరు..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు, అల్ప్రాజోలం, ముడి సరుకు

కామారెడ్డి క్రైం: కల్తీ కల్లులో వినియోగించే నిషేధిత మత్తు పదార్థం అల్ప్రాజోలంను సరఫరా చేస్తున్న ఓ ముఠా సభ్యులను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని మద్నూర్ గ్రామానికి చెందిన ఉదాలత్‌వర్ సురేశ్‌గౌడ్ ఇంటిపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో 110 గ్రాముల అల్ప్రాజోలం పట్టుబడింది. సురేశ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నిషేధిత అల్ప్రాజోలంను హైదరాబాద్ శివారు ప్రాంతంలోని నాచారంలో ఉండే వ్యాపారి దినేష్‌కుమార్ మొహంతి వద్ద నుంచి కొనుగోలు చేశానని చెప్పాడు. దీంతో పోలీసులు సురేశ్‌ను వెంట తీసుకుని నాచారంలోని దినేష్ కుమార్ వద్దకు వెళ్లి విచారించారు. నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్‌లో ఉండే కృష్ణ అనే వ్యక్తి వద్ద నుంచి వారు అల్ప్రాజోలం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కృష్ణ అల్ప్రాజోలంను ఇతర ముడి సరుకులతో కలిపి తయారు చేసి సురేశ్‌గౌడ్‌తోపాటు మద్నూర్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు చాలాసార్లు విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కృష్ణ వద్ద 153 గ్రాముల అల్ప్రాజోలం, 4 సెల్‌ఫోన్లు, 8 రకాల ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు సురేశ్‌గౌడ్, దినేష్ కుమార్ మొహంతి, కృష్ణలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

### వృద్ధురాలి మృతదేహం లభ్యం

రుద్రూర్: మండలంలోని లింగంపల్లి శివారులో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు ఆదివారం మధ్యాహ్నం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతురాలు కోటగిరి మండలం ఎత్తోండా గ్రామానికి చెందిన దేగావత్ లక్ష్మీబాయి (62)గా గుర్తించారు. ఈనెల 26 నుంచి లక్ష్మీబాయి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేకపోవడం, గత నాలుగు రోజులుగా ఆహారం లేనందున ఆరోగ్యం క్షీణించి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. ఈమేరకు మృతురాలి భర్త లింబ్యా నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.